

నవతెలంగాణ

కరీంనగర్

గురువారం | నవంబర్ 16, 2023 | www.navatelangana.com

ముగిసిన ఉపసంహరణ..

ఊపందుకోనున్న ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ కీలక ఘట్టం బుధవారంతో ముగిసింది. ఓట్లు చీల్చుతారనుకున్న పలువురు స్వతంత్రులను ప్రధానపార్టీల అభ్యర్థులు బుజ్జగింపులు, తాయిలాలతో విత్‌డ్రా చేయించారు. ఒక్క మానకొండూర్ తప్ప మిగిలిన 11 నియోజకవర్గాల్లో 15మందికిపైగానే అభ్యర్థులు బరిలో ఫైనల్‌కాగా పలుచోట్ల రెండేసి ఈవీఎం మిషన్లు అవసరం అవుతున్నాయి. మొత్తంగా ఉపసంహరణ పర్వం ముగిసిన నేపథ్యంలో గురువారం నుంచి ప్రచారపర్వం ఊపందుకోనుంది. ప్రచార రథాలు, కార్యకర్తల నినాదాలు, నేతల ఉపన్యాసాలు, ఇంటింటి ప్రచారం, బైక్ ర్యాలీలులతో గ్రామాలు, పట్టణాలలో ఎన్నికల సందడి మరింత పెరగనుంది. ఇదే క్రమంలో అలకపాన్పులు ఎక్కిన సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను బుజ్జగిస్తూనే వారు పార్టీ చేజారకుండా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వారికి సొంతపార్టీ అభ్యర్థులు, ప్రత్యర్థిపార్టీవాళ్లు...తాయిలాలు, హామీలు ఇచ్చి తమవైపునకు తిప్పుకునేందుకు పోటీపడుతున్నారు.

- నవతెలంగాణ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

▸ మిగతా 2లో...


ప్రత్యర్థులెవరో తేలడంతో స్పీడందుకోనున్న ప్రచార హోరు

ఎన్నికల ఖర్చు తప్పించుకునేందుకు బర్త్‌డేల పేరుతో సభలు, సమావేశాలు


ఫైనల్‌గా12 నియోజకవర్గాల్లో బరిలో తేలిన 216 మంది అభ్యర్థులు

తిరస్కరణకు గురైనవి46, ఉపసంహరణ చేసుకున్నవి 45

నియోజకవర్గం	మొత్తం నామినేషన్లు	తిరస్కరణకు గురైనవి	ఉపసంహరణ చేసుకున్నవి	బరిలో ఉన్న అభ్యర్థులు
కరీంనగర్	38	7	4	27
మానకొండూర్	20	7	3	10
చొప్పదండి	18	1	3	14
హుజూరాబాద్	33	8	3	22
పెద్దపల్లి	30	5	8	17
రామగుండం	31	5	3	23
మంథని	28	4	3	21
సిరిసిల్ల	23	0	2	21
వేములవాడ	22	2	4	16
జగిత్యాల	21	2	4	15
కోరుట్ల	25	5	5	15
ధర్మపురి	18	0	3	15
మొత్తం	307	46	45	216



ఓటేసే ముందు.... నేస్తమా ఆలోచించు



నవతెలంగాణ - సిరిసిల్ల : పాలిచ్చే గేదె ధర లక్ష ...ఇంట్లో పెంచుకునే పెంపుడు కుక్క ఖరీదు 20 వేలు. మేకకు 10 వేలు... కానీ ఓటరుకు మాత్రం 500 లేదా 1000 అంటూ వాటికంటే అధ్వాన్నమై... మన హక్కును అమ్ముకుందామా..? అంటూ... ఓ మహిళ నిజాయితీగా ఓటేయాలని చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఐదేళ్ల అధికారాన్ని ఇచ్చేందుకు వేసే ఓటుకు వెయ్యి తీసుకుంటూ.. రోజుకు 54పైసలు. ఇదే 500 తీసుకుంటే రోజుకు 27 పైసలు చొప్పున లబ్ధి చేకూరుతుంది. కానీ... ఇలా ఓటును అమ్ముకోవడం ద్వారా విలువైన వ్యక్తిత్వాన్ని.. లాభాలను, అభివృద్ధిని కోల్పోతున్నామనే లిఖిత సందేశం వాట్సాప్‌లలో చెక్కర్లు కొడుతోంది.

మద్యం, మాంసం, డబ్బు, బంగారం, చీరలు.. సారెలు.. ఇలా మాకు ఏదీ వద్దు.. ప్రగతి కావాలంటూ మరో లిఖిత సందేశం వాట్సాప్‌లలో వైరల్‌గా మారింది. నాయకులు ఇచ్చే తాయిలాల విషయంలో ఓటర్లు ఒకసారి ఆలోచించాలి మనం వేసే ఓటు రాజకీయ నాయకుడికి ఐదేళ్లపాటు ఉన్నత పదవిని అధికారాన్ని కట్టబెడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో

▸ మిగతా 2లో...

- ▸ రాజన్న సిరిసిల్ల జిల్లాలో శాసనసభ నియోజకవర్గాలు-02
- ▸ పోటీ పడుతున్న ప్రధాన పార్టీలు - 03
- ▸ ప్రధాన పార్టీల నుంచి పోటీ పడే అభ్యర్థులు - 06
- ▸ 40లక్షలతో అయితే ఆరుగురు చేసే ఖర్చు - రూ.2.40కోట్లు
- ▸ ఓ సర్వే సంస్థ అధ్యయనం ప్రకారం వ్యయం- రూ.120 కోట్లు



సెంటు భూమి కోసం 35 రోజులుగా పోరాటం

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ

నవతెలంగాణ-జగిత్యాల : సెంటు భూమి కోసం 35 రోజులుగా పోరాటం చేస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 437/112/2లో 220 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇల్లు లేని నిరుపేదలకు కేటాయించాలని సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో శాంతియుతంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. స్థలాల వద్ద నిరుపేదలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఆటోనగర్ కోసం ప్రభుత్వం భూమి కేటాయించిందని, ఇందిరమ్మ ఇండ్లు కూలగొట్టి అదే స్థలంలో డబల్ బెడ్రూమ్ ఇండ్లు నిర్మించారని తెలిపారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇల్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని చెప్పిందన్నారు. ఏ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యే అభ్యర్థులైన తమ పోరాటానికి మద్దతు తెలపడానికి రావడం లేదని, రాబోయే ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. సుమారు 3000 గుడిసెలు, తమ పోరాటానికి మద్దతు తెలిపిన అభ్యర్థులను 12 వేల ఓట్ల మెజారిటీతో గెలిపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, సిఐటియు జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన, తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వాహనం తనిఖీ



నవతెలంగాణ-గంభీరావుపేట: మండల పరిధిలోని పెద్దమ్మ చెక్ పోస్ట్ వద్ద టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం కామారెడ్డి నుంచి సిరిసిల్లకు వెళ్తున్న రేవంత్‌రెడ్డి వాహనాన్ని చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహిం చారు. పోలీసుల తనిఖీలకు రేవంత్‌రెడ్డి పూర్తిగా సహకరించారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవతెలంగాణ-సిరిసిల్లటౌన్ : దేవాలయాల్లో చోరీ చేసిన కేసులో ఇద్దరికి ఏడాది జైలు విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పు వెలువడించారు. 2023 జూన్ 29న రగుడు ఎల్లమ్మ దేవాలయం, సిరిసిల్ల విశ్వనాథ ఆలయంలో చోరీ జరిగిందని ఆలయాల అధికారులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చోరీ చేసిన మైలారం ఆశారాములు, బాలె నర్సింహులను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. విచారణ అనంతరం నిందితుడు నేరంను కోర్టులో అంగీకరించటంతో మేజిస్ట్రేట్ నిందితుడికి 1 సంవత్సరం జైలు శిక్ష విధించారు. అదేవిధంగా 2013లో సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాలో పోలీస్ అధికారిపై దాడి చేసిన నిందుతుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, 2000 రూపాయల జరిమానా విధించారు.

గ్రామాల్లో పురమల్ల ప్రచారం

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : కరీంనగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ బుధవారం గోపాలపూర్, దుర్శేడ్, నల్లగుంటపల్లె తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని హమీ ఇచ్చారు. గంగుల కమలాకర్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే యూత్‌కు సెల్‌ఫోన్లు, ప్యాకేజీలు పంచుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 100రోజులలోపు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, నాయకులు బెజ్జంకి శేఖర్, బెజ్జంకి శ్రీనివాస్, పాలకుర్తి లక్ష్మణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్‌లో పలువురు చేరగా వారికి పురుమల్ల శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.



సీఎం సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 20న నిర్వహించే సీఎం కేసీఆర్ మానకొండూర్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లను మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బుధవారం పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి.రామకృష్ణరావు, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పాశం అశోక్‌రెడ్డి, మాతంగి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ రామడుగు : మండలంలోని వెలిచాల గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు, 110మంది యువకులు రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. మండలంలోని గోపాలరావుపేట అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, 50మంది యువకులు పార్టీలోకి చేరారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నవతెలంగాణ - కరీంనగర్ :

కరీంనగర్‌లోని మంత్రి గంగుల కమలాకర్ నివాసం వద్ద బుధవారం కమాన్‌పూర్‌కు చెందిన 40 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గంగుల హరిహరణ్, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ - శంకరపట్నం : బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. శంకరపట్నం మండలం అంబాలాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు రానివేని శంకర్ బుధవారం కేశవపట్నం పాత బస్టాండ్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్నటువంటి బైక్ ఢీకొట్టింది. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 ఫోన్ చేశారు. సిబ్బంది ఈఎంటి సతీష్‌రెడ్డి, పైలట్ ఖాజా ఖలీల్లాలుక్షతగాత్రున్ని అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ముగిసిన ఉపసంహరణ..

▶ మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ అన్ని పార్టీల కంటే ముందుగానే అభ్యర్థుల ప్రకటించడంతో అప్పటి నుంచి చాలా నియోజకవర్గాలలో ప్రత్యర్థి ఎవరో తెలియక వారే ప్రచారం నిర్వహించుకుంటూ వచ్చారు. నామినేషన్ల చివరి తేదీ వరకు బీఫామ్‌లు అందుకున్న తరువాతనే ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఖరారు కాలేదు. ఇక నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ వంటి కీలకఘట్టాలు ముగిసిన నేపథ్యంలో ఇప్పటివరకు సాదాసీదాగా ఎన్నికల ప్రచారం నిర్వహించినప్పటికీ గురువారం నుంచి అభ్యర్థుల మధ్య సీరియస్ వార్ ప్రారంభం కానుంది.ఈ నెల 30వ తేదీన ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ నెల 28వ తేదీ వరకే అభ్యర్థులు ప్రచారం నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అంటే అభ్యర్థులు ప్రచారం చేసుకోవడానికి కేవలం 12 రోజుల సమయం మాత్రమే ఉంది. దీంతో 'ఎవరి వ్యూహాలు వారివే, ఎవరి ధీమా వారిదే.' అన్నరీతిలో ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థుల పోటీ పోటీ ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంది.

అసంతృప్తులపై నజర్.. తాయిలాలతో ప్రసన్నం..

పార్టీల్లోని అసంతృప్తులపై ప్రత్యర్థి పార్టీల నాయకులు కన్నేస్తున్నారు. వారిని రహస్యంగా కలుసుకుని వారికి మద్దతుగా పనిచేయాలని కోరుతున్నారు. వారికి భారీ ఆశలు చూపించి తమవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నాలూ ఇంకా కొనసాగిస్తున్నారు. వారికి ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చి వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. ఒకవేళ పార్టీలోకి రాకున్నా అంతర్గతంగా తమకు మద్దతుగా ఓట్లు వేయించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు బూత్ స్థాయిలో ప్రచారానికు రోజుకు రూ.10 వేల వరకు కార్యకర్తలకు ఖర్చుచేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. గ్రామాల్లో ఇప్పటికే కులాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. వారికి భోజనాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించి వారి కోర్కెలు వింటూ వాటిని అమలు చేస్తామని హమీలిస్తున్నారు. ఓ కులానికి ఓ పార్టీ అభ్యర్థి సమావేశం పెట్టి విందు భోజనాలు ఏర్పాటు చేస్తే, మరునాడే మరో అభ్యర్థి అక్కడే సమావేశం పెట్టి విందుభోజనాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులను మించి హమీలిస్తున్నారు. దీంతో అక్కడి ప్రజలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితులున్నాయి. ఒకరోజు ఓ పార్టీ కండువా కప్పుకున్న వాళ్లు మరునాడే మరో పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఇదే క్రమంలో ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహిస్తున్న సభలు, సమావేశాలు ఎన్నికల వ్యయం పరిధిలోకి రాకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు. వీరు సభలు నిర్వహిస్తున్న ప్రాంతంలో ఎవరిదో ఒకరి పుట్టినరోజుని, పెళ్లిరోజుని విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

మొత్తం నామినేషన్లు 307, బరిలో నిలిచింది 216 అభ్యర్థులు

ఈ నెల10తో నామినేషన్ దాఖలు ప్రక్రియ పూర్తికాగా 12 నియోజకవర్గాల పరిధిలో 307 మంది నామినేషన్లు వేశారు. మొత్తం పత్రాలను పరిశీలించిన అధికారులు46 పత్రాలను తిరస్కరించి ఫైనల్‌గా 261 నామినేషన్లకు అర్హత ఉన్నట్టు ప్రకటించారు. మంగళ, బుధవారాల్లో సాగిన ఉపసంహరణ తరువాత మరో 45 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా ప్రస్తుతం 12 నియోజకవర్గాల్లో 216 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వారందరికీ ఎన్నికల సంఘం అధికారులు గుర్తులూ కేటాయించారు. అయితే ఇందులో మానకొండూర్ మినహా మిగిలిన 11 స్థానాల్లో 15కుపైగానే అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరందరికీ గుర్తులు కేటాయించిన నేపథ్యంలో రెండేసి ఈవీఎంలు అవసరం పడనున్నాయి. అయితే మానకొండూర్, ధర్మపురి, జగిత్యాల, చొప్పదండిలో ఒకే ఈవీఎం సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

ఓటేసే ముందు.. నేస్తమా ఆలోచించు

▶ మొదటిపేజీ తరువాయి

ఓటు ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజల తరఫున చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించి జనుల సామాజిక, ఆర్థిక, ఉపాధి, ప్రగతి అవసరాలు, పనులు చేసేందుకు కృషి చేయాలి.ఈ నేపథ్యంలో ఓటర్ నిజాయితీగా జాగరుకతతో వ్యవహరించకపోతే నాయకులనుంచి మనము నిజాయితీ పాలనను ఆశించలేమన్న విషయాన్ని గుర్తుంచుకోవలసిన అవసరం ఉంది

ఎన్నికల వ్యయం..

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చేసే వ్యయం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ఎన్నికల సంఘం నిర్దేశించింది. మరొకటి ఎన్నికల్లో పోటీ ఆధారంగా అభ్యర్థులు చేసేది. ఓ సర్వే సంస్థ అధ్యయనంలో ఒక్కో ప్రధాన పార్టీ కోట్లకు మించి ఖర్చు చేయాల్సి ఉంటుందని తేలింది. వాస్తవానికి ఎన్నికల సంఘం ఒక్కో అభ్యర్థికి రూ.40 లక్షలను గరిష్ఠ ఎన్నికల వ్యయంగా పరిమితి విధించింది. కానీ ఈ ఖర్చు కేవలం నామినేషన్ ప్రక్రియ వరకు మాత్రమే సరిపోతుందనే వాదన ఉంది. దాదాపు నెల రోజుల కాలానికి అభ్యర్థులు కార్యకర్తలు ప్రచార రథాల నిర్వహణ, సభలు, సమావేశాలు, ర్యాలీలు, జెండాలు, ఇతరత్రా ఖర్చులతోపాటు మద్యం, విందు, ఇతర తాయిలాలు, నగదు పంపిణీ చేయడం లాంటి ఖర్చులు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఎన్నికల సంఘం ఎంత కట్టడి చేసినా ఈ ప్రలోభాలు అనేవి కొనసాగుతూనే ఉన్నాయి. ఇందుకు బరిలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఓటర్లే చైతన్యవంతులై ప్రలోభాలకు ఆకర్షితులు కాకుండా సమర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం, బాధ్యత ఓటర్ల పైనే ఉంది. ఈ క్రమంలో యువ ఓటర్లు మరింత చైతన్యశీలురు కావలసిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పవర్‌లూం కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలి..

సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:

పట్టణంలోని ఈనెల 17న సిరిసిల్లలోని నెహ్రూనగర్ అమ్మభవాని ఫంక్షన్ హాల్‌లో జరిగే పవర్‌లూం కార్మికుల సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బీవైనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే సిరిసిల్లలో అత్యధిక పవర్‌లూమ్స్ ఉండి వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని కార్మికుల సంక్షేమానికి పెద్దపీట చేశామని గొప్పగా ప్రకటిస్తున్నాడు. కానీ గత పది సంవత్సరాల క్రితం ఇక్కడ కార్మికులకు ఇచ్చిన హమీలు కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రస్తుతం బతుకమ్మ చీరలకు సంబంధించి పవర్‌లూం కార్మికులకు ఇస్తామని ప్రకటించిన 10 శాతం యారన్ సబ్సిడీ మూడు సంవత్సరాలది కార్మికులకు రావాల్సి ఉందన్నారు. 2021 సంవత్సరం సబ్సిడీ ప్రాసెస్ పూర్తయి రెండు నెలలు అవుతున్నా కూడా బతుకమ్మ దసరా, దీపావళి పండుగలకు కూడా కార్మికులకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించార న్నారు. ఈ సమావేశానికి సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ వీరయ్య తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, గుండు రమేష్, సబ్బాని చంద్రకాంత్, బెజుగం సురేష్, బింగి సంపత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్

కవ్వంపల్లి ఓటమి భయంతో మాట్లాడుతున్నాడు

జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ - గన్నేరువరం : ఓటమి భయంతో కవ్వంపల్లి సత్యనారాయణ మతి భ్రమించి మాట్లాడ తున్నాడని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమాజిపల్లి గ్రామం లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎన్నికల ప్రచార సభలో పెన్షన్ కోసం ప్రశ్నించిన కాంతాల సురేందర్‌రెడ్డిపై ఏ మాత్రం దాడి జరగలేదని అన్నారు. సురేందర్‌రెడ్డి సమస్య తెలుసుకోవడానికి మాత్రమే అతని వద్దకు వెళ్లినట్టు తెలిపారు. గ్రామస్థాయి పెన్షన్ సమస్యను చూపించి కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గస్థాయిలో అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని, దమ్ముంటే కవ్వంపల్లి నిరూపించాలని సవాల్ విసిరారు. ఆయనవెంట నాయకులు మన్‌మోహన్‌రావు, గంప వెంకన్న, లింగాల మహేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి

ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండల కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించే సీఎం ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. బుధవారం ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చొప్పదండి నియోజకవర్గం కాళేశ్వరం జలాలతో కోనసీమగా మారిందన్నారు. 120 కోట్లతో చొప్పదండిని అన్ని విధాల అభివృద్ధి చేసినట్టు చెప్పారు.

పలు గ్రామాల్లో ప్రచారం : గంగాధర మండలంలోని నారాయణపూర్, నాగిరెడ్డిపూర్, చర్లపల్లి (ఆర్), ర్యాలపల్లి, లింగంపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీపీ శ్రీరాం మధూకర్, కొత్త జయపాల్‌రెడ్డి, సర్పంచులు పంజాల లక్ష్మి, ఎండి నజీర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు పాల్గొన్నారు.

గంగులకు శివశక్తి టిప్పర్ అసోసియేషన్ సభ్యుల మద్దతు

నవతెలంగాణ - కరీంనగర్ : శివశక్తి టిప్పర్ అసోసియేషన్ సలహాదారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్, అధ్యక్షుడు చందు, ప్రధాన కార్యదర్శి అభిలాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌కి పూర్తి మద్దతు ప్రకటించాలని తీర్మానం చేశారు. సభ్యులందరూ కలిసి మంత్రి గంగుల కమలాకర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్, నాయకులు నందెల్లి మహిపాల్, వాసల రమేష్, జమీలుద్దీన్ పాల్గొన్నారు.

c m y k

నవతెలంగాణ
కరీంనగర్
గురువారం | నవంబర్ 16, 2023 | www.navatelangana.com

ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

హుజురాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితల ప్రణవ్



నవతెలంగాణ - జమ్మికుంట/ ఇల్లందకుంట

రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి, నాగంపేట్, శాయంపేట్, బిజిగిరి షరీఫ్ గ్రామాల్లో, ఇల్లందకుంట మండలం రాచపల్లి, మల్లన్నపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఉద్యోగులకు జీతం సరైన టైంకి ఇవ్వడం చేతగాని ప్రభుత్వం మనకు అవసరమా అని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం నుంచి 20 సంవత్సరం నుండి గెలుస్తూ ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా ఈటల రాజేందర్ కొనసాగినప్పటికీ చేసిందేమీ లేదని ఆరోపించారు. ఈటల రాజేందర్ హుజురాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తు.. గజ్వేల్‌కి వెళ్లి అక్కడ బిడ్డనని, హుజురాబాద్‌కు వచ్చి ఇక్కడ బిడ్డనని అంటున్నారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను గడపగడపకు అందజేసేలా నిర్విరామంగా పనిచేస్తానని తెలిపారు. అనంతరం బిజిగిరి షరీఫ్ దర్గాలో ప్రార్ధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు రామారావు, నాయకులు అరుకాల విరేశలింగం, కసుబోసుల వెంకన్న, ఎండి.సలీం, రేణుక శివకుమార్ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం



అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కరీంనగర్ కమిషనరేట్‌లోని గన్నేరువరం పోలీస్ స్టేషన్ పరిధి గన్నేరువరం, జంగపల్లి, మైలారం గ్రామాల్లో అనుమానస్పద, సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన స్పెషల్ యాక్షన్ టీమ్ లను రంగంలోకి దింపామన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా వీరి సేవలను వినియోగిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అవసరమైన అన్ని చోట్ల అకస్మిక తనిఖీలు, మెరుపు దాడులు జరుపుతామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వారి పట్ల చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

రేపు సీఎం సభను విజయవంతం చేయాలి

ఎస్సీ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంటలో ఈ నెల 17న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్ కోరారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ద్వారా పది లక్షల రూపాయలను ఇచ్చారని సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బహిరంగ సభకు దళితులు కుటుంబాలతో సహా హాజరుకానున్నట్లు తెలిపారు. దళిత బంధు రెండవ విడత కొంతమందికి రాలేదని, వారందరికీ తప్పకుండా వస్తాయని, కొంతమంది తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దని కోరారు. ఆయనవెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు పర్లపల్లి రమేష్, అంబాల ప్రభు, పోడేటి రామస్వామి, రాజేష్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు



కాంగ్రెస్ పార్టీ చేరుతున్న ఎంపీటీసీ, మాజీ సర్పంచులు

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన బీజేపీ ఎంపీటీసీ కూకట్ల తిరుపతి, మాజీ సర్పంచులు జక్కన్న, వెంకటయ్యతోపాటుగా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మునిగాల సుధాకర్ గౌడ్, మునిగాల రాజేందర్, కోలపురి శ్రీకాంత్, కనుమల్ల రాజశేఖర్, రాజన్నల తిరుపతి పాల్గొన్నారు.

'కార్యకర్తలే పార్టీకి బలం'

నవతెలంగాణ - హుజురాబాద్

కార్యకర్తలే పార్టీకి బలం అని బీఆర్ఎస్ హుజురాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో హుజురాబాద్ పట్టణ, మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఐలయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంపీపీ ఇరుమల రాణి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామానికి చెందిన 50మందిపైగా యువకులు నాయకుడు గాదె ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే జమ్మికుంట మండలంలోని వావిలాల, గోపాలపురం, నాగంపేట గ్రామాలకు చెందిన సుమారు వంద మంది యువకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వరరావు, ఎర్రబెల్లి తిరుపతిరావు, దొండపల్లి గ్రామ అధ్యక్షులు, నాయకులు వీరేశలింగం, ఐలాపురం హరీష్, మామిడి రాజేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాంగ్రెస్‌కు రైతాంగం తగిన గుణపాఠం చెప్పాలి

చొప్పదండి మార్కెట్ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి

నవతెలంగాణ - చొప్పదండి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి

రైతులకు 10 హెచ్పీ మోటర్‌కు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని అవగాహన లేకుండా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో తెలంగాణ రైతాంగం తగిన గుణపాఠం చెప్పాలని చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ 10 హెచ్పీ మోటర్‌కు సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని, దానిని పెట్టుకునే సామర్థ్యం రైతులకు ఉండదనే విషయం తెలియకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాజశేఖర్, యువజన అధ్యక్షుడు అజయ్, డైరెక్టర్‌లు గాండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డ్‌కు సన్మానం

నవతెలంగాణ-కరీంనగర్ క్రైం : హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ బి.సమ్మిరెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు కమిషనరేట్ కేంద్రంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.5వేల చెక్కును అందజేశారు. విధుల పట్ల అంకితభావంతో దాదాపు 24 సంవత్సరాలు పోలీస్ శాఖకి సేవలందించి ఎలాంటి రిమార్క్ లేకుండా ఉద్యోగ విరమణ పొందినందుకు పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్ దంపతులు

నవతెలంగాణ - కరీంనగర్



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి

కరీంనగర్ మాజీ కార్పొరేటర్ కట్ల విద్యసతీష్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లతో పాటు దాదాపు 20 మంది బీఆర్ఎస్ నేతలు బుధవారం కామారెడ్డిలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన కట్ల సతీష్ దంపతులు మాట్లాడుతూ.. ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగిన తమకు కేసీఆర్ అన్యాయం చేశారని, పార్టీలో సముచిత స్థానం కల్పించకుండా అవమానించారన్నారు. ఈ చర్యలను, కేసీఆర్ విధానాలను ఖండిస్తూ బీఆర్ఎస్ శాశ్వత సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్, జంగిలి కుమార్, హమీద్, శైలజ, భార్గవి, ఉప్పు రవి, నిజాముద్దీన్, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా గంధం రాజు



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రెడ్డిగాని రాజు అన్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన గంధం రాజును మండల ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన పై ఉన్న నమ్మకంతో .. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రెడ్డిగాని రాజు, సీనియర్ నాయకులు మాచర్ల అంజయ్య, పొలం మల్లేషం యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన లక్ష్మీపూర్ యువకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన 25 మంది యువకులు కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు రాజీనామా చేసి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. యువకులకు ఎమ్మెల్యే గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ల ఉపసంహరణ

నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. నామినేషన్లు ఉప సంహరణ అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. కంది అశోక్‌రెడ్డి, కొట్టే రమేష్, షకురొద్దీన్ మాట్లాడుతూ.. మంత్రి గంగులతోనే అభివృద్ధి సాధ్యం, రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం అన్నారు.

కొత్తపల్లి పట్టణంలో ప్రచారం

నవతెలంగాణ - కొత్తపల్లి : బుధవారం కొత్తపల్లి మున్సిపల్ పట్టణంలో బీఆర్ఎస్ తరపున అనుమల్ల చంద్రమౌళి, ఎస్కే బాబా, కట్ల సుధాకర్, బైరి రాజు, భోగ శ్రీనివాస్, గజ్జల శివరాం, సద్దాం, పుప్పాల సన్నీ ఇంటింట ప్రచారం చేశారు. గంగుల కమలాకర్‌ని నాలుగోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

హుజురాబాద్ బరిలో 23 మంది అభ్యర్థులు

ముగ్గురు ఉపసంహరణ

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గంలో నుండి 23 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు తెలిపారు. చివరి రోజు బుధవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. స్వతంత్ర అభ్యర్థులు పైడిపల్లి అంజయ్య, కొత్తూరి రమేష్, బండి శ్రీనివాస్ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారని ఆయన తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించి వారికి ఎన్నికల సంఘం ఇచ్చిన సూచనలు వివరించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని జూగుండ్ల గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్, పర్లపెల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ గుమ్మడి రాజుతో పాటు 150 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, ఇందిరా నగర్ గ్రామానికి చెందిన నలుగురు వార్డు సభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, గోగూరి నరసింహారెడ్డి, రంగారావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ - సైదాపూర్ : మండలంలోని బొమ్మకల్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. హుస్నాబాద్ నియెజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీష్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు మైల మొగిలి, రుద్రారపు రాజేంద్రప్రసాద్, రుద్రారపు రవితేజ, కోమల, కార్తీక్, వేముల నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి

బీఆర్ఎస్వీ అధ్యక్షుడు ఫహాద్



నవతెలంగాణ - కరీంనగర్ : బీఆర్ఎస్వీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్, తెలంగాణ ఉద్యమకారుడు ఫహద్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఫహద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం చేసి ఊపిరి వదిలిన వారిని గుర్తించని తెలంగాణ కేసీఆర్ ప్రభుత్వం ఉన్న ఉద్యమకారులను ఏమి గుర్తిస్తుందని అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలని కోరారు.

నవతెలంగాణ 4
జగిత్యాల-పెద్దపల్లి
గురువారం 16 నవంబర్ 2023 www.navatelangana.com

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, నైతికంగా, నిర్భయంగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్భయంగా ఓటువేసే విధంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు వివరించాలన్నారు. డబ్బు, మద్యం, బహుమతులు తదితర ఏ రూపేనా తీసుకున్నా ఇచ్చినా వారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నెల 30న కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి శాసన సభ నియోజకవర్గాల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించే విధంగా జిల్లా యంత్రాంగానికి తోడ్పాటు అందించాలని కోరారు. జిల్లాలో ఈ నెల 10వ తేదీ నాటికి 6,99,203 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 3,37,919 పురుషులు, 3,61,254 మంది మహిళలు, 30 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారని తెలిపారు. జిల్లాలో 785 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో కోరుట్ల నియోజకవర్గంలో 262, జగిత్యాల నియోజకవర్గంలో 254, ధర్మపురి నియోజ కవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఫారం -12 ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. 80 ఏళ్లకు పైబడిన వయో వృద్ధులకు 40 శాతం పైబడిన దివ్యాంగులకు ఇంటి నుండే ఓటింగ్ సౌకర్యం కల్పించేందుకు ఫారం -12డి ద్వారా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఓటరు సమాచార పత్రాలను ఓటరు గైడ్ లను నేటి నుండి ఈ నెల 25 వరకు బూత్ స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేస్తూ ఆయా ఓటర్ల సంతకాలను రిజిస్టర్‌లో తీసుకోవడంతో పాటు ఆ ఇంటిలో ఓటర్ల వివరాలు, మరణించిన, శాశ్వతంగా వెళ్ళిపోయినా వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారులు సుధీర్, రఘువరన్, శ్రీనివాస్, భీమ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ తిరుపతి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ భాషా

చెక్ పోస్ట్ తనిఖీ చేసిన ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాల

ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలోని గండి హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సిబ్బందికి సూచించారు.

బిఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కుమార్ ప్రచారం


సంజయ్‌కి తిలకం దిద్దుతున్న సర్పంచ్ లావణ్య

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్, రామాలచ్చక్కపేట, ఆత్మకూరు, ఆత్మనగర్, మెట్ల చిట్టాపూర్, కేసీఆర్ తండా, ఎస్ఆర్ తండా, విత్తంపేట గ్రామాల్లో బుధవారం బిఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు తో కలిసి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు, తిరుపతిరెడ్డి, ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ బద్దం సుగుణ, రాజేష్, పుల్లా జగన్, డాకూరు వెంకటేష్, రఘు, గుగ్గిళ్ల సురేష్, స్థానికనాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జువ్వాడి కృష్ణారావు ప్రచారం

నవతెలంగాణ-మల్లాపూర్

కాంగ్రెస్ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి జువ్వాడి నర్సింగారావుకు మద్దతుగా సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు మండలంలోని రేగుంట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన 50 మంది పార్టీలు చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతి రెడ్డి, పొంద్ర శ్రీనివాస్‌రెడ్డి అల్లూరి మహేష్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రఘు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఏనుగు రాజారెడ్డి పాల్గొన్నారు.



ఎన్నికలు వస్తేనే బిఆర్ఎస్‌కు ప్రజలు గుర్తొస్తారు..

మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-ముత్తారం:

ఎన్నికలు వస్తేనే బిఆర్ఎస్‌కు ప్రజలు గుర్తుకు వస్తారని మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్‌కి చెందిన మాజీ సర్పంచ్ తాటి పాములు వకు ళారాణిశంకర్ సుమారు 100 మంది బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీ బంధు, దళిత బంధుల పేరుతో అప్లికేషన్‌లు తీసుకొని ఒక్కరికి కూడా పథకాలు అందించలేదని అన్నారు. ప్రజలు బిఆర్ఎస్ చేసే ప్రతి పనిని గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే బీఆర్ఎస్ పార్టీని బంద్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మాజీ జడ్పీటీసీ జగన్మోహన్ రావు, మాజీ ఎంపీటీసీ వనం రాంచందర్‌రావు తదితరులున్నారు.


మాట్లాడుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ విఫలం

కాంగ్రెస్ రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం విఫలం అయ్యిందని, రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ రామగుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సింగరేణి ఓసిపి 5పై బుధవారం సంఘటిత, అసంఘటిత జిల్లా కన్వీనర్ పెంచాల తిరుపతి ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

రామగుండం కార్పొరేషన్ 28వ డివిజన్ వినోభానగర్‌కు చెందిన బిఆర్ఎస్ నాయకుడు ఆర్మూల సతీష్‌తో పాటు 150మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రామగుండం కార్పొరేషన్ 2, 3, 4, 23 డివిజన్‌లలో బుధవారం రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాదయాత్ర చేశారు. ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ అమలు చేసే ఆరు గ్యారంటీలను వివరించారు.


కార్మికులను కలుసుకుంటున్న మక్కాన్‌సింగ్

కాంగ్రెస్ మాటలు నమ్మితే నట్టేట మునిగినట్టే..

రామగుండం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:

లేనిపోని వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మాటలు చెబుతున్నా కాంగ్రెస్ పార్టీని నమ్మితే మన జీవితాలు నట్టేట మునిగినట్లేనని రామగుండం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ 47వ డివిజన్ అడ్డగుంటపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్రలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, బిఆర్ఎస్ నాయకురాలు మూల విజయారెడ్డి పాల్గొన్నారు.



బీఎస్పీలో చేరిన పలు పార్టీల నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్

బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష సమక్షంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఎస్పీలో చేరారు. వారికి దాసరి ఉష కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంపల్లి బాబు, పెద్దపల్లి మాజీ జడ్పీటీసీ ఈర్ల కొమరయ్య పాల్గొన్నారు .

తనిఖీల్లో కోటి 51 లక్షల 16 వేల 860 సీజ్

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై 11 కేసులు నమోదు
- జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి

తనిఖీలలో ఇప్పటి వరకు కోటి 51 లక్షల 16 వేల 860 చేసి, కోటి 9 లక్షల 16 వేల 860 విడుదల చేసినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటివరకు కోటి 51 లక్షల 16 వేల 860 నగదు జప్తు చేసి, సంబంధిత వ్యక్తులు సమర్పించిన ఆధారాలను తనిఖీ చేసిన జిల్లా గ్రీవెన్స్ కమిటీ, కోటి 9 లక్షల 16 వేల 860 నగదును విడుదల చేసినట్లు తెలిపారు. సరైన ఆధారాలు సమర్పించనందున 42 లక్షల నగదు విడుదల సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఇప్పటి వరకు 11 కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 137 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఇప్పటివరకు 1339 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-కథలాపూర్

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం మండల మండల కేంద్రంలో బీఆర్ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభకు కేటీఆర్ హాజరై మాట్లాడారు. 60 ఏండ్లల్లో ఏమి చేయని కాంగ్రెస్ వాళ్లు ఒక్క ఛాన్స్ ఇవ్వాలని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ, నరేంద్ర మోడీ, అమిత్ షా వచ్చి కల్లిబొల్లి మాటలు చెప్పి మనల్ని నట్టేట ముంచుతారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేటీఆర్

కొప్పుల ఈశ్వర్ సతీమణి ప్రచారం

నవతెలంగాణ-ధర్మపురి

మండలంలోని నేరెళ్ల గ్రామంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి కొప్పుల సోషల్ ఆర్గనైజేషన్ సంస్థ చైర్మన్ కొప్పుల స్నేహలత ప్రచారం నిర్వహించారు. ఎస్సీ హరిజన కాలనీ, వడ్డెర కాలనీ, గంగపుత్ర కాలనీ, బస్టాండ్ ప్రాంతాలలో ఓట్లు అభ్యర్థించారు. వారి వెంట సర్పంచ్ పలిగిరి వసుంధర సత్యం, గ్రామ మహిళా అధ్యక్షురాలు చక్రాల రజిత, కరవత్తుల రాధా, ఇరగదీండ్ల లక్ష్మి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చేర్ల రాజేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చక్రాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ జాజాల శంకర్, ఉడుత గంగారాం, గ్రామ ఉపాధ్యక్షుడు ఇరగదీండ్ల వేణు పాల్గొన్నారు.


పాల్గొన్న స్నేహలత

బిఆర్ఎస్ నేతల ప్రచారం

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో బిఆర్ఎస్ నేతలు బుధవారం ప్రచారం నిర్వహించారు. మంథని బిఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్, సర్పంచ్ శారదా సదానందం, ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు బియ్యాని రాజు, మైదంబండ ఎంపీటీసీ బియ్యాని శ్యామల సదానందం, మైదంబండ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ శంకర్, మండలం యూత్ ఉపాధ్యక్షులు వినయ్‌కుమార్ పాల్గొన్నారు. ముత్తారం మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్‌రావు ఆధ్వర్యంలో మంథని బిఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.



దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగింది..

- చందుర్తి, రుద్రంగి ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్



చందుర్తి ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-చందుర్తి: దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రం ఎదిగిందని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల గ్రామంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కావాలా.. కరెంటు కావాలా.. 60 సంవత్సరాల పాలనలో తెలంగాణ కాంగ్రెస్ పాలనలో అధోగతి అయిందని విమర్శించారు. ఈ ఎన్నిక ఆది శ్రీనివాస్‌కు లక్ష్మీ నరసింహారావు మధ్య పోటీ కాదు.. పార్టీల మధ్య పంచాయితీ అని అన్నారు. చందుర్తి మండలంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథతో తాగునీరు ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పార్టీల నాయకులు



కండువా కప్పి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి

నవతెలంగాణ-ఇల్లంతకుంట: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ సమ క్షంలో బుధవారం పలువురు నాయ కులు కాంగ్రెస్‌లో చేరారు. ఫ్యాక్స్ డైరెక్టర్ సృజన్‌రెడ్డి, అనం తగిరికి చెందిన మల్లారెడ్డి, చంద్ర య్యలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రేపాక గ్రామ యాదవ సంఘ సభ్యులు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఐలయ్య యాదవ్, మహేందర్‌రెడ్డి, మల్లేశం, ముత్యం పాల్గొన్నారు.

తెలంగాణను కాంగ్రెస్ చేతిలో పెట్టొద్దు

- జడ్పీ వైస్ చైర్మన్ వేణు



ప్రచారం చేస్తున్న వేణు

నవతెలంగాణ-ఇల్లంతకుంట: కొట్లాడి సాధించిన తెలంగాణను కాంగ్రెస్ చేతుల్లో పెట్టకూడదని జడ్పీ వైస్ చైర్మన్ వేణు అన్నారు. ముస్కాని పేట గ్రామంలో బుధవారం గడప గడప ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లు గారి రవీందర్‌రెడ్డి, గాలిపెల్లి ఫ్యాక్స్ చైర్మెన్ అన్నాడి అనంతరెడ్డి, రమేశ్‌రెడ్డి, తిరుపతి, అనిల్, నాయకులు పాల్గొన్నారు .

రెండు మొబైల్ ఫోన్‌ల అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-ఇల్లంతకుంట: సీఈఐఆర్ అప్లికేషన్ సహాయంతో పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్‌లను పట్టుకొని బాధితులకు అప్పగించినట్లు ఇల్లంతకుంట ఎస్ఐ డి.సుధాకర్ బుధవారం తెలిపారు. గతంలో వంతడ్పుల గ్రామానికి చెందిన గవ్వల శ్రీనివాస్ తన 15 వేల విలువ గల మొబైల్ ఫోన్ పోయిందని, వల్లంపట్ల పంచాయతీ సెక్రెటరీ బి.శ్రీనివాస్ తన 15 వేల విలువ గల మొబైల్ ఫోన్ పోయిందని, ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి మొబైల్ ఫోన్‌ల వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేయగా ఆ ఫోన్‌లలో వేరే వ్యక్తులు సిమ్ కార్డులు వేసుకున్నట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్‌కు అలెర్ట్ మెసేజ్ రావడంతో ఆ మొబైల్ ఫోన్‌ను ఈనెల 13న గుర్తించి వాటిని బుధవారం బాధితులకు అప్పగించామన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

నవతెలంగాణ- ఇల్లంతకుంట: ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఐ డి.సుధాకర్ తెలిపారు. బుధవారం ఉదయం ఇల్లంతకుంట మండలంలోని అనంతారం, పెద్దలింగాపూర్, దాచారం, సిరికొండ, అనంతగిరి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుళ్లు, మధు, లక్ష్మీనారాయణ, బాపు చందర్, క్రాంతి లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నరసన్న

నవ తెలంగాణ-సిరిసిల్ల: బీఆర్ఎస్ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గడ్డం నరసయ్య పదవికి రాజీనామా చేశాడు. దీంతో సిరిసిల్ల బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ ఎదురైంది. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్ష పదవితో పాటు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గడ్డం నర్సయ్య బుధవారం తెలిపారు. తన రాజీనామా లేఖను కేసీఆర్‌కు ప్యాక్స్ ద్వారా పంపినట్లు వెల్లడించారు. గతంలో కాంగ్రెస్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా రైతు కిసాన్‌సెల్ రాష్ట్ర కో చైర్మన్‌గా పనిచేశారు. త్వరలోనే నర్సయ్య ఓ జాతీయ పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

చట్టసభల్లో సమస్యలను వివరిస్తా..



ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

నవతెలంగాణ-వీర్నపల్లి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే చట్టసభలో సమస్యల వివరించి.. పరిష్కారం చూపుతానని సిరిసిల్ల నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శ్రీనివాస్ బుధవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నుంచి డప్పు చప్పులతో ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సిరిసిల్ల బరిలో 21 మంది అభ్యర్థులు

- ఇద్దరు నామినేషన్లు ఉపసంహారణ

నవతెలంగాణ-సిరిసిల్లటౌన్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం ముగిసింది. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి 23 మంది అభ్యర్థులు నామినేషన్లు అందజేయగా, అందులో స్వతంత్ర అభ్యర్థులైన కటకం మృత్యుంజయం, పల్లికొండ నరసయ్య ఇద్దరు బుధవారం ఉపసంహరణ చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. దీంతో సిరిసిల్లలో 21 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

కాంగ్రెస్‌లో నూతన ఉత్సాహం



రేవంత్‌రెడ్డిని కలుస్తున్న కార్యకర్తలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం పర్యటించడంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం కలిగింది. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మండల కేంద్రంలోని పాత బాస్టాండ్‌లో రెండు నిమిషాలు ఆగి కార్యకర్తలతో మాట్లాడి సిరిసిల్ల వెళ్లినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి రేవంత్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు షేక్‌గౌస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల కృష్ణ, కిసాన్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సాహెబ్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల పలు సబ్జెక్టుల్లో ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల నోటు బుక్స్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రమేష్, కేజీబీవీ కోఆర్డినేటర్ పద్మజ, మండల నోడల్ అధికారి గాలిపెల్లి కృష్ణహరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దబ్బెడ హన్మాండ్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుబేరా స్వామి పాల్గొన్నారు.

ఓటు వేసే ముందు ఆలోచించండి

- బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు మనోజ్



సమావేశంలో మాట్లాడుతున్న మనోజ్

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేసే ముందు ఆలోచించాలని బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ తెలిపారు. పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్‌లో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిరిసిల్ల పట్టణ పద్మశాలి సోదరి సోదరులకు ధన్యవాదములు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి విలువైన ఓటును బీఆర్ఎస్ పార్టీకి వేయాలని కోరారు. ఈ సమావేశంలో మునీర్, షాద, సాయి, అజ్జు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు



కండువా కప్పుతున్న జైపాల్ రెడ్డి

నవతెలంగాణ-బోయినిపల్లి: బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ యువ నాయకుడు వేసిరెడ్డి రితీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది యువకులు బీఅర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీ కొత్తజైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల యూత్ అధ్యక్షుడు కట్ట గోవర్ధన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రామిడి రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-బోయినిపల్లి: మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు జనరల్ డాక్టర్ సీఆర్ ప్రసన్న ఐఏఎస్ పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో మౌళిక వసతులు, గత సంవ త్సరం జరిగిన ఎన్నికల సరళి బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసారి పోలింగ్ శాతం పెంచాలని కోరారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తా

- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సామల పావని



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పావని

నవతెలంగాణ-సిరిసిల టౌన్: కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తానని సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్పర్సన్ సామల పావని అన్నారు. అంతకుముందు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరారు. అనంతరం సిరిసిల్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో మున్సిపల్ చైర్మన్ గా పనిచేస్తూ సిరిసిల్లను ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసి ఢిల్లీ స్థాయిలో ఐదు అవార్డులు తీసుకువచ్చానన్నారు. బీఆర్ఎస్‌లో ఒక కార్యకర్తకు ఇచ్చిన విలువ కూడా మాజీ మున్సిపల్ చైర్మన్‌గా తనకు విలువ ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, డీసీసీ మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, లక్ష్మీనారాయణ, కల్లూరు చందన, సామల దేవదాస్, వెలుముల స్వరూప, ఆడెపు చంద్రకళ, మ్యా ప్రసాద్ పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొండూరి గాంధీ

నవతెలంగాణ-గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం సంచరించుకుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయ కుడు కొండూరి గాంధీ అన్నారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్యర్యంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని కొండూరి గాంధీ ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్‌లో పలువురు చేశారు. కొండూరి గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి పటేల్, రాజలింగారెడ్డి, ముస్తాబాద్ మాజీ సింగిల్ విండో చైర్మన్ చక్రధర్ రెడ్డి ఎంపీటీసీ పరుశరాములు, మండల ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రాజాగౌడ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు దేవరాజు, మహిళ అధ్యక్షురాలు కళా అధ్వర్యంలో నాయకులు గడప గడపకు మేని ఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కళావతి సురేష్ నాయక్, ఎంపీపీ భూలా, జడ్పీ కో ఆప్షన్ చాంద్ పాషా, ఏఎంసీ వైస్ చైర్మన్ తులసిరామ్ పాల్గొన్నారు

అందరికీ ఐదు లక్షల బీమా

- తంగళ్ళపల్లి రోడ్ షోలో మంత్రి కేటీఆర్



రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

నవతెలంగాణ -తంగళ్ళపల్లి: తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఐదు లక్షల బీమా వర్తించే పథకాన్ని మంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలో ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా బుధవారం బీఆర్ఎస్ రోడ్ షో నిర్వహించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో కేసీఆర్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని ఆయన వివరించారు.

నవతెలంగాణ-కోనరావుపేట: సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని రాష్ట్ర మంత్రి కే తారక రామారావు అన్నారు. కోనరావుపేటలో జరిగిన సమావేశాలలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ గెలిపిస్తే ప్రజలు మళ్లీ కన్నీళ్ల పాలవుతారని, కరెంటు కోతతో ఇబ్బందులకు గురవుతారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి చల్మెడ లక్ష్మీ నర్సింహరావును గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఉన్నారు.

కేకే మహేందర్‌రెడ్డి గెలువాలని పూజలు

నవతెలంగాణ-వీర్నపల్లి: సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే మహేంద ర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలు పొందాలని బుధవారం హన్‌మాన్ ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండ లంలోని మద్దిమల్ల గ్రామంలో ఇంటింటికి ప్రచారం చేసి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, మండల నాయకులు తుడుము రవీందర్, నక్క శ్రీనివాస్, బొంగు తిరుపతి ఉన్నారు.

పోలింగ్ అధికారులకు అవగాహన

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నియోజవర్గ పరిధిలోని ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో సెక్టర్ ఆఫీసర్స్, పోలింగ్ అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్, 12డి విధానాలపై రామగుండం నియోజక వర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ.) అరుణ్ శ్రీ అవగాహన కల్పించారు. పోస్టల్ బాలెట్, 12డి విధానం నోడల్ అధికారి జ్యోతి మాట్లాడుతూ.. ఈసారి రాష్ట్రంలో ఎన్నికలకు సంబంధించి నూతన విధానం 12డి ఆమోదించినట్టు తెలిపారు. ఈ నూతన విధానానికి సంబంధించి 80 ఏండ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులు, కోవిడ్ బాధితులను ఇంటి వద్ద నుంచి ఓటు వేసే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

నియోజకవర్గం పరిధిలో 12డికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 331 గాను, ఇందులో వికలాంగులు 184గా, 80 సంవత్సరాలు పైబడిన వద్ధులు 147గా వివరించారు. 12డి ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రతి ఒక్క టీంలో ఇద్దరు పోలింగ్ అధికారులు పిఓ, అసిస్టెంట్ పిఓ, ఒక సెక్టర్ ఆఫీసర్, ఒక బిఎల్ఓ, ఒక పోలీస్ అధికారి, మైక్రో అబ్జర్వర్ ఒకరు, వీడియో గ్రాఫర్ ఒకరు, పార్టీలకు సంబంధించిన పోలింగ్ ఏజెంట్లు కూడా ఉంటారని తెలిపారు. అదేవిధంగా ఓటు వేసే ప్రక్రియను సీక్రెట్‌గా ఉండేలా కంపార్ట్మెంట్ కవర్ కూడా ఏర్పాటు చేసి, ఓటు వేసిన విధానం బ్యాలెట్ పత్రాన్ని కవర్లో ప్యాక్ చేసిన విధానం తదితర అంశాలపై సూచనలు, నియమ నిబంధనలు తెలిపారు.ఈ సమావేశంలో పోస్టల్ బాలెట్, 12డి విభాగం నోడల్ అధికారి జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ట్రైనింగ్ నోడల్ అధికారి సంపత్ రావు, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయరమణారావు

నవతెలంగాణ - పెద్దపల్లిటౌన్
ప్రజా సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు అన్నారు. బుధవారం మండలంలోని అప్పన్నపేట, రాఘవపూర్, రంగాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాఘవపూర్ సర్పంచ్ ఆడెపు వెంకటేశం, ఎంపీటీసీ తోట శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమణరావు

అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-గోదావరిఖనిటౌన్:
గోదావరిఖని ప్రభుత్వ హాస్పిటల్ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం మగువ జోన్ చైర్ పర్సన్ లయన్ సోమారపు లావణ్య అరుణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ద్వారా ఎంతో మందికి సేవలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బంక రామస్వామి, మగువ ప్రెసిడెంట్ డాక్టర్ లక్ష్మి వాణి, సెక్రటరీ గాలి సునీత, ట్రెజరర్ శశి కల, సుజాత, లావణ్య, మంజుల, శ్వేత, లక్ష్మి, స్వర్ణలత, క్లబ్ సభ్యులున్నారు.


అన్నదానం చేస్తున్న సొమారపు లావణ్య

గంగపుత్రులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ -మెట్‌పల్లి
రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల పట్ల జగిత్యాల జిల్లా గంగ పుత్రులు అప్రమత్తంగా ఉండాలని డీఫీసీఎస్ తాత్కాలిక అధ్యక్షుడు పల్లికొండ ప్రవీణ్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గలలో దాదాపు లక్షా 10 వేల మంది గంగపుత్రులు ఉన్నారన్నారు. అధిక సంఖ్యలో ఉన్న కూడా గంగపుత్రుల సమస్యలను ఇప్పటివరకు ఏ పార్టీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గంగపుత్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు న్యాయవాది అరవింద్, జిల్లా తాత్కాలిక డైరెక్టర్లు పల్లికొండ భూమేష్, ఎల్ల శ్రీనివాస్, సముద్రాల రూప, పర్రె శంకర్, జంబర్తి రమేష్, లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రవీణ్

కిరణ్ కుమార్ ప్రచారం

నవతెలంగాణ-మల్లాపూర్
మండలంలోని రాఘవపేట, సిరిపూర్ గ్రామంలో తెలంగాణ కల్చర్ అసోసియేషన్ వ్యవస్థాపక కిరణ్ కుమార్ పిచర ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో 32 నియోజకవర్గాల్లో గెలుపు ఓటమిలో ప్రభావితం చేయగల సత్తా గల్ఫ్ ఓటు బ్యాంక్ ఉన్నదని అన్నారు. కోరుట్ల నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థి చెన్నమనేని శ్రీనివాసరావుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ జఏసీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మున్నూరుకాపులు

నవతెలంగాణ -మెట్‌పల్లి
మెట్‌పల్లి పట్టణానికి చెందిన మున్నూరు కాపు సంఘ నాయకుడు గోనెల రాజరెడ్డి ఆధ్వర్యంలో సంఘ పెద్దమనుషులు కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి సరోజన సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, మార్గం గంగాధర్, ఓజ్జెల శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీమణి

నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి

పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ-పెద్దపల్లి
ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో అధికారులు, రైస్ మిల్లర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యం మేర నిర్వహించి, రైస్ ఉత్పత్తిలో వేగం పెంచి లక్ష్యం మేరకు సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాలన్నారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాలు చేరుకోని రైస్ మిల్లులపై తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్, మిల్లర్లు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌళిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పద్మశాలి సహకార సంఘాలను నెలకొల్పాలి


మాట్లాడుతున్న పద్మశాలి సంఘం నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
పద్మశాలి సేవా సంఘం నేతృత్వంలో పద్మశాలి సహకార సంఘాలను నెలకొల్పేందుకు రామగుండం పద్మశాలి సంఘం సిద్ధంగా ఉందని, గెలిచిన ప్రభుత్వాలు సహకరించాలని పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండారి రాజమల్లు, బూర్ల దామోదర్, సిరిమల్ల జయరాములు అన్నారు. స్థానిక మార్కండేయకాలనీలో రామగుండం పద్మశాలి సేవా సంఘం, పోపా, మహిళ, యువజన సంఘాల మొదటి కార్యవర్గ సమావేశం పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడు బండారి రాజమల్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామగుండం నియోజకవర్గ ఏరియాలో పద్మశాలి సహకార సంఘాలను నెలకొల్పేందుకు గెలిచిన ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు సిరిమల్ల జయరాములు, అధ్యక్ష, కార్యదర్శులు బండారి రాజమల్లు, బూర్ల దామోదర్, వడ్డేపల్లి దినేష్, చిప్ప లలిత శ్రీ, మాటేటి మౌనిక, మాటేటి సతీష్, బొద్దుల వేణు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనుల జీవితాల్లో వెలుగు

బీఎస్పీ ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నక్క విజయ్‌కుమార్

నవతెలంగాణ-వెల్గటూర్
బీఎస్పీతోనే బహుజనుల జీవితాల్లో వెలుగు అని బీఎస్పీ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ పార్టీ మాయ మాటలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. నిరుపేదలకు డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వలేదని, దళితబంధు బీఆర్ఎస్ నాయకులకు ఇచ్చారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బతుకులు మారలంటే బీఎస్పీని ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షుడు కుశనపెల్లి శ్రీనివాస్, వెల్గటూర్ ఎండపల్లి, పెగడపల్లి, గొల్లపెల్లి, బుగ్గారం, ధర్మారం మండలం అధ్యక్షులు బచ్చల స్వామి, తడకొండ కార్తీక్, నక్క గంగాధర్, కల్లెపెల్లి తిరుపతి, అనిల్ ముదిరాజ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నక్క విజయ్‌కుమార్

42, 46, 47 డివిజన్లలో టిఎల్‌పి నేతల ప్రచారం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
రామగుండం కార్పొరేషన్ 42, 46, 47 డివిజన్లలోని శ్రీనివాస్ టాకీస్ ఏరియా, మున్సిపల్ కాలనీ, తిరుమల్ నగర్, జవహార్ నగర్, విజయ నగర్ ఏరియాలోతెలంగాణ లేబర్ పార్టీ రామగుండం అభ్యర్థి గొర్రె రమేష్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.రామచంద్రారెడ్డి, కలగూర మల్లయ్య, ఎండి.హుస్సేన్, కంది శ్రీనివాస్, చిప్పకుర్తి విజయ్‌కుమార్, ఎండి.సర్వర్, రాజేందర్, ఆరెపల్లి కనకయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-ఎండపల్లి
మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో మల్లికార్జున రాజన్నల కుల సంఘం అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ మెరుగు జానీ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, గాజుల మల్లేశం ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్‌కు జనరల్ జనక్ ప్రసాద్ లేఖ

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణి యాజమాన్యం ఎలక్షన్ కోడ్ పేరుతో గనుల మీద ప్రచారాన్ని నిషేధించడంపై ఎలక్షన్ కమిషన్‌తో పాటు జిల్లా ఎన్నికల అధికారికి ఐఎన్‌టీయుసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ లేఖ రాశారు. ఈ లేఖలో సింగరేణి తెలంగాణ వ్యాప్తంగా 6 జిల్లాలో విస్తరించి 12 అసెంబ్లీ స్థానాలను ప్రభావితం చేస్తుందని, సింగరేణి బొగ్గు గనుల కార్మికులు తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారని వారి సమస్యలను అడిగి తెలుసుకోవడం కోసం అభ్యర్థులను కార్మిక సంఘాల నాయకులను అనుమతి ఇవ్వాలని యాజమాన్యానికి సూచన చేయాలని ఈ లేఖ ద్వారా కోరారు.

బిఆర్ఎస్‌లో బీజేపీ నాయకుల చేరిక


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సింగల్ విండో చైర్మన్

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలో బీజేపీకి చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారదా సదానందం, ఎంపీటీసీ శ్యామల సదానందం, గ్రామ శాఖ అధ్యక్షులు వెంకట రెడ్డి, ముత్తారం యూత్ ప్రధాన కార్యదర్శి బియ్యాని వినయ్ కుమార్, ముత్తారం మండల బిఆర్ఎస్ ఉపాధ్యక్షుడు బియ్యాని రాజు, ఉప సర్పంచ్‌శంకర్ పాల్గొన్నారు.

ముస్లింలు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలి



మాట్లాడుతున్న మైనార్టీ నాయకుడు ముఖిమ్

నవతెలంగాణ -మెట్‌పల్లి
ముస్లింలంతా ఏకమై కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎంఎ ముఖీమ్ కోరారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు లోపాయికార ఒప్పందం చేసుకొని ఎన్నికల బరిలోకి దిగాయని ఆరోపించారు. మైనార్టీలను మోసం చేసిన ఈ పార్టీలను బొంద పెట్టి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు సలీం, ఖలీంఖాన్, దులూరు చాంద్, అజహార్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ :జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా ఎన్నికల అధికారి, ఇతర శాఖల అధికారులతో కలిసి పని చేస్తామని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. జిల్లాలో మొత్తం పోలింగ్ స్టేషన్లు 927, సాధారణ పోలింగ్ స్టేషన్లు 676, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 251 ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 3351 వ్యక్తులు బైండోవర్ చేసినట్టు చెప్పారు. గతంలో ఎలక్ట్రోరల్ నేరాలకు పాల్పడ్డ వ్యక్తులను, అందులో సహకరించిన వ్యక్తులను బైండోవర్ చేశామని, రౌడీ షీట్ కలిగిన వారిని కూడా ముందస్తుగా బైండోవర్ చేశామని తెలిపారు.

స్వాధీన పరుచుకున్న వివరాలు..

ఇప్పటివరకు రూ.2,35,61,331 నగదు స్వాధీనపరచుకున్నారు. లిక్కర్ 5230 లీటర్లు, రూ. 24,66,749 గా అంచనా వేశారు.

ఇతర సామాగ్రి:

చీరలు 3962, టవల్స్ 1228, 950 సారి పెట్టి కోట్స్, 1907 తెల్ల చొక్కాలు, 132 హ్యాండ్ బ్యాగ్‌లు, 140 హాట్ బాక్స్‌లు,104 క్లాక్‌లు, 21 కుట్టు మిషన్లు, ఇతర వస్తువులు సుమారుగా అంచన విలువ రూ. 1,41,49,846 గా, సీజ్ చేసినా నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువుల విలువ మొత్తం విలువ రూ. 4,17,36,140గా ఎస్పీ పేర్కొన్నారు.

చెక్‌పోస్ట్‌లు:

జిల్లా సరిహద్దుల్లో ఉన్న 9 చెక్ పోస్ట్‌ల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళికతో ఏర్పాటు చేశారు.

లైసెన్సుడు ఆయుధముల డిపాజిట్ :

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నియామవళి అనుసారంగా లైసెన్సు కలిగిన ఆయుధములు అన్ని డిపాజిట్ కోసం అండర్ సెక్షన్ 144 సీఆర్‌పీసీ అనుసరించి నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న మొత్తం 44 డిపాజిట్ చేశారు.

సోషల్ మీడియాపై నిఘా కోసం 24,7 ఐటీ సభ్యులతో కూడిన స్పెషల్ టీంతో పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

మూడు నామినేషన్ల ఉపసంహారణ


నామినేషన్లను ఉపసంహరించుకున్న అభ్యర్థులు

నవతెలంగాణ-మంథని : మంథని అసెంబ్లీ నామినేషన్ల పరిశీలనలో భాగంగా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామి నేషన్లను ఉపసంహరించుకున్న వారిలో మాచిడి సుజిత్‌గౌడ్, నాగినేని జగదీశ్వర్ రావు, ఐలి సతీష్ ఉన్నారని రిటర్నింగ్ అధికారి వి. హనుమ నాయక్ తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-జగిత్యాల టౌన్ :జగిత్యాల మున్సిపాలిటీలోని 24వ వార్డు బీజేపీ కౌన్సిలర్ గుర్రం రాము బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ కండువా కప్పి పార్టీకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు దావా సురేష్, చందా పృథ్వీ పాల్గొన్నారు.

18న జగిత్యాలలో ఉద్యమకారుల సదస్సు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : పదేండ్ల తెలంగాణ పాలన, అమరుల ఆశయాలపై జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల18న శనివారం తెలంగాణ ఉద్యమకారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఉద్యమాల జేఏసీ నాయకులు, తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు చుక్క గంగారెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాల రథసారథి, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంతో పాటు పలువురు వక్తలు హాజరు కానున్నట్లు ఆయన సూచించారు. జేఏసీ సభ్యులు కుల సంఘాలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవం చేయాలని కోరారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని శివగాయత్రి అనాథ వృద్ధాశ్రమంలో సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా అనాథలకు పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు ఆముద గంగారాం, జిల్లా అధ్యక్షుడు బొడుకని కృష్ణ, అభిమానులు పాల్గొన్నారు.

డబ్బాలో బిఆర్ఎస్ నాయకుల ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి గంగాధర్, ఎంపీటీసీ దేశెట్టి శాంతి, మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, దేశెట్టి జీవన్, కోటి అరుణ్, ఎలుక అశోక్, కంఠం యేసు రత్నం, దుద్దుల మైపాల్, కనుక నాగరాజ్, దుద్దుల రాజేందర్, గరిగే గంగు,పోల్కం రాజేశ్వరి, నేమురి పద్మ , సదల లింగు, ఎడ్ల రఘు,రాజు తదితరులు పాల్గొన్నారు.

దాసరి మనోహర్ రెడ్డి ప్రచారం


ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న దాసరి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : మండలంలోని కాట్నపల్లి, నరసయ్యపల్లి, బొంతకుంటపల్లి, భూపతిపూర్, ఐతురాజుపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదేండ్లల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ 50 ఏండ్లలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, సర్పంచ్ మోరపల్లి మోహన్ రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పాల రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక శ్రీనివాస్, బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, ఎంపిటిసి సభ్యురాలు పొన్నాల అనిత అంజయ్య పాల్గొన్నారు.

అవకాశం కల్పిస్తే మీ బిడ్డల భవిష్యత్ నాదే..

బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్


గ్రామాల్లో ప్రచార నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్,ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్

నవతెలంగాణ-మంథని : మరోసారి అవకాశం కల్పిస్తే మీ బిడ్డల భవిషత్‌కు భరోసా కల్పిస్తానని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. మంథని మండలంలోని పలు గ్రామాల్లో పుట్ట మధూకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతి ఏడాది పేదింటి ఆడబిడ్డలకు పెండ్లి చేస్తానని, ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లో ఉండే పేద విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తానని హామీ ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ పాలకులు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో బిల్లులు మాయం చేసి మన సొంతింటి కలను విచ్చిన్నం చేశారన్నారు. కానీ ఈసారి గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేయించి మూడు లక్షలతో పాటు తాను కొంత సాయం చేసి గొప్పగా ఇంటి నిర్మాణం చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాంతానికి చెందిన వెలమలు, రెడ్డిలను రాజకీయంగా అణిచివేసిన చరిత్ర వాళ్లదేనన్నారు. ఓ బీసీ బిడ్డగా తాను ఈ స్థాయికి ఎదిగితే అనేక కుట్రలు, అబద్దాలు, అసత్య ప్రచారాలతో రాజకీయ సమాధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు.

ఏఐసీసీ మీడియా కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్


కలవల శ్రీనివాస్

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్ : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఏఐసీసీ మీడియా కోఆర్డినేటర్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన కల్వల శ్రీనివాస్‌ను ఏఐసీసీ తెలంగాణ ఎన్నికల కమ్యూనికేషన్ ఇన్‌చార్జి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ అజయ్‌కుమార్ నియమించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి డోలి శర్మ, మాజీ మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణపూర్‌లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ - సుల్తానాబాద్ రూరల్ : సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామ ఎంపీటీసీ మండల రమేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.


తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నిర్వీర్యం

- ఐదేళ్లలో 6 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- పదవులు ప్రధానం కాదు ప్రజా సేవే ముఖ్యం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల : తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నిర్వీర్యం చేశారని పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం నిరుద్యోగులు, విద్యార్థుల ఆత్మబలిదానాలు చేసుకుంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, కానీ ఉద్యోగాలు భర్తీ చేయకుండా కేసీఆర్ నిరుద్యోగుల ఆత్మస్థైర్యం దెబ్బతీశారని ఆరోపించారు. సాఫ్ట్ వేర్ రంగంలో స్థానికత ప్రాతిపదికన రిజర్వేషన్ లేకపోవడంతో తెలంగాణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగులకు 10 నుంచి 20 శాతానికి మించి అవకాశాలు లభించడం లేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత మళ్లీ గల్ఫ్ వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉపాధి లభిస్తే, గల్ఫ్ వెళ్తారా అని నిలదీశారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల ఆదుకునేందుకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీతో పాటు, ప్రతి ఏడాది లక్ష చొప్పున ఐదేళ్లలో ఆరు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

కప్పారావుపేటలో బీఆర్ఎస్ ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు

నవతెలంగాణ-వెల్గటూర్ : మండలంలోని కప్పారావుపేట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ముగల సత్యం, గ్రామ శాఖల అధ్యక్షులు గాజుల రాకేష్, ఉపసర్పంచ్ బత్తిని భరత్,గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి ఎర్రం రాము, ఎర్రం తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

బీఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్


ప్రచారంలో డా॥ సంజయ్ కుమార్

నవతెలంగాణ-సారంగాపూర్ : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని బీఆర్ఎస్ జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి, లక్ష్మీదేవి పల్లె, రంగపేట, నాగనూర్, లచ్చక్కపేట, పోచంపేట, పెంబట్ల, కోనాపూర్ గ్రామాల్లో సంజయ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని పేర్కొన్నారు. బీజేపీకి పేదలపై శ్రద్ధ లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా లచ్చక్కపేట గ్రామానికి చెందిన పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు, బిజెపి నాయకులు దాసరి ప్రదీప్ ,పోచంపేట గ్రామానికి చెందిన 20 మంది రైతులు సర్పంచ్ పల్లికొండ రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు లింగన్న ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సారంగాపూర్ మండల పార్టీ గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఎంపీపీ కోల జమున శ్రీనివాస్, జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్ పాల్గొన్నారు.

మంత్రి కొప్పుల ప్రచారం..



నవతెలంగాణ- జూలపల్లి : జూలపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ గడపగడపకు వెళ్లి కారు గుర్తుకు ఓటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ముత్యాల కరుణశ్రీ, సింగిల్ విండో చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ పసునూటి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఇర్ల మల్లేశం, ఎంపీటీసీలా ఫోరం అధ్యక్షులు దండే వెంకటేశం పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన రజక సంఘం నాయకులు


కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి కొప్పుల

నవతెలంగాణ-వెల్గటూర్ : మండలంలోని కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన రజక సంఘం సభ్యులు ఏదునూరీ నర్సింహస్వామి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు ఎదునూరి స్వామి, గుడికందుల సత్యనారాయణ, ఎదునూరి చందు, ఎదునూరి రాజయ్య, లచ్చయ్య నర్సింగం, పిల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

c m y k

ఓటరు మేలుకో.. వినూత్న నిరసన

నవతెలంగాణ - భగత్‌నగర్



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌కు చెందిన కోట శ్యామ్ కుమార్ ఓటరు మేలుకో అంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. 'గవర్నమెంటు హాస్పిటల్లో సరిగా వైద్యం అందక చనిపోతున్న ప్రతి ఒక్కరి చావుకు ఓటు అమ్ముకుంటున్న వారే కారణం' అంటూ ప్లకార్డు చేతపట్టి డాక్టర్ యూనిఫాంలో ఆయన నిరసన తెలిపారు. ప్రతి ఒక్కరు నిజాయితీగా ఓటువేయాలని కోరారు.

ఎమ్మెల్యే అనుచరుల దాడి అమానుషం

డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ

పెన్షన్ అడిగినందుకు దాడి చేశారు : బాధితుడు కాంతల సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - గన్నేరువరం : హనుమాజీపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఎన్నికల ప్రచారంలో అదే గ్రామానికి చెందిన కాంతాల సురేందర్‌రెడ్డిపై ఎమ్మెల్యే అనుచరులు జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి దాడి చేయడం అమానుషమని డిసిసి అధ్యక్షుడు, మానకొండూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఖండించారు. బుధవారం హనుమాజిపల్లి గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలకు హద్దు అదుపు లేదని, ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుండి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. బాధితుడు కాంతాల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు వికలాంగుల పెన్షన్ రావడంలేదని ఎమ్మెల్యేను అడుగుతున్న తరుణంలోనే జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి స్టేజి పైనుండి దిగివచ్చి తనపై దాడి చేశాడని ఆరోపించారు. గతంలో తాను బీఆర్ఎస్ పార్టీలో పని చేశానని, ఉప కాలువ నిర్మాణం చేపట్టడం లేదని ప్రశ్నించిన కారణంగానే తనపై కక్షతో దాడికి పాల్పడ్డాడని, తనకు జెడ్పీటీసీతో ప్రాణహాని ఉన్నదని తనకు రక్షణ కల్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ముసుకు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుకూరి అనంతరెడ్డి, అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, నందికొండ తిరుపతిరెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి



నవతెలంగాణ - చొప్పదండి

ఎన్నికల నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఈ నెల 30న తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చొప్పదండి నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రఫుల్ దేశాయి అన్నారు. చొప్పదండిలోని ఎన్నికల కార్యాలయంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు జక్కని నరేందర్, భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్‌లు శ్రీనివాస్, అరుణ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఓటింగ్ సదుపాయం

వృద్ధులు, వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

నవతెలంగాణ - కరీంనగర్

ఈ నెల 30న పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కును వినియోగించుకోలేని అర్హులైన వికలాంగులు, వృద్ధుల కోసం భారత ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటింగ్ సదుపాయాన్ని కల్పించిందని కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వికలాంగులు, వృద్ధులకు పోలింగ్ కేంద్రంలో కల్పించాల్సిన వసతులపై బీఎల్ఓలకు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వికలాంగులు, వృద్ధులు ఎన్నికలలో పాల్గొని వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అన్ని విధాలుగా సౌకర్యాలను కల్పించిందని తెలిపారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, 40 శాతం కన్న ఎక్కువ వైకల్యం ఉన్న వారి కోసం ఇంటి వద్ద నుంచే తమ ఓటుహక్కు వినియోగించుకునేలా హోం ఓటింగ్ సదుపాయాన్ని కల్పించినట్టు చెప్పారు. బీఎల్ఓల ద్వారా 12డీ ఫారంలను నోడల్ అధికారులు నియోజకవర్గం వారిగా స్వీకరించడానికి నియమించినట్టు తెలిపారు. ఇతర వృద్ధులు, వికలాంగుల ఓటింగ్ కోసం ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక సదుపాయాలను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఓటింగ్‌లో వికలాంగులు, వృద్ధులు పాల్గొని అందరికి ఆదర్శంగా నిలిచి ఓటింగ్ శాతం పెంచడంలో మీ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. వికలాంగులకు పోలింగ్ రోజు సదరం సర్టిఫికెట్ అడగకూడదని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ సరస్వతి, అడిషనల్ డీఆర్డీఓ సంధ్యారాణి, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు సముద్రాల జనార్ధన్‌రావు, పెన్షన్ సంఘం అధ్యక్షుడు మెసం అంజయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యుడు కేశవరెడ్డి, తెలంగాణ పీడబ్ల్యూడీ అధ్యక్షుడు రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయాలోపడి ఆగం కావొద్దు

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



నవతెలంగాణ - తిమ్మాపూర్

'వారంటీ.. గ్యారెంటీ లేని కాంగ్రెస్ మోసపూరిత హామీలను, మాయమాటలు నమ్మి ప్రజలు ఆగం కావద్దని.. ఆ పార్టీకి ఓటేసే మళ్లీ ఊర్లను అంధకారం చేస్తారని' మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మల్లాపూర్, పోలంపల్లి, నర్సింగపూర్, రామకృష్ణకాలనీ, పర్లపల్లి గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు మంగళహారతులు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ 11 సార్లు అధికారంలో ఉన్నదని, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని కూడా పెట్టలేదని... తానే స్వయంగా అణభేరి విగ్రహాన్ని ఏర్పాటు చేయించానని అన్నారు. అభివృద్ధి చేశానని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గడ్డం నాగరాజు, సర్పంచులు మామిడి సతీష్, బొజ్జ తిరుపతి, తోట మమతమధు, ఎంపిటిసిలు పుప్పాల కనకయ్య, గట్టుదుద్దేనపల్లి సహకార సంఘం చైర్మన్ అనభేరి రాధాకిషన్‌రావు, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, ఉప సర్పంచ్ బుడగే పరశురాంగౌడ్, నాయకులు ఖమ్మం కష్ణ, పెరిక రవి, మురహరి రెడ్డి, సతీష్, సదానందం పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లలో సీపీ తనిఖీ

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం/ శంకరపట్నం



హుజురాబాద్, కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లను పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి బుధవారం అకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేరస్తుల, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ జీవనరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, కేశవపట్నం ఎస్‌హెచ్‌ఓ, ఎస్సై పి.లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి




విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ : క్రీడలు విద్యార్థులకు తప్పనిసరని, అందులో పాల్గొనడం ద్వారా విజయాలను సులభంగా పొందవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన బి.సహస్ర, ఎస్.నిషితాల్ 8వ తరగతి బాలికల అండర్-14 విభాగంలో, బాలుర విభాగంలో కె.రెడ్డి 7వ తరగతి, పి.శ్రీయాన్ష్, డి.శ్రేయస్ రాజ్ 8వ తరగతి ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని పుష్పగుచ్చాలతో పాటు అర్హత పత్రాలను ప్రదానం చేసి జాతీయ స్థాయికి సైతం ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

దోపిడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్నకాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - గంగాధర : రెండుసార్లు అధికారాన్ని చేపట్టి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన సీఎం కేసీఆర్ దోపిడీ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో బుధవారం నిర్వహించిన చొప్పదండి నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, నాయకులు సత్తు కనకయ్య, పులి లక్ష్మీపతి, పుల్కం నర్సయ్య, పురుమల్ల మనోహర్ పాల్గొన్నారు.

చేపల పెంపకంపై శిక్షణ..

నవతెలంగాణ - రామడుగు : రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం సమన్వయంతో మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో చేపల పెంపకంపై రెండు రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అధ్యక్షుడు, ఉత్తమ జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ బుధవారం తెలిపారు. 21నుండి 51సంవత్సరాల వయసున్న 100మంది స్త్రీలు, పురుషులకు చదువుతో సంబంధం లేకుండా శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 9989237381, 9573403782 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్వతంత్ర అభ్యర్థి వినూత్న ప్రచారం



కరీంనగర్ నియోజకవర్గంలోని చింతకుంట గ్రామానికి చెందిన నిరుద్యోగి బెల్లపు కరుణాకర్ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో బరిలో దిగాడు. కొన్ని రాజకీయ పార్టీలు ఉచితాలను ఆశచూపి అవి మళ్లీ సామన్యుడిపైనే భారం వేసేలా చేస్తున్నాయని.. దీంతో విసిగివేసారి ఈసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. పార్టీ కండువాలు కప్పు కోవడం కోసం రూ.5000, రూ.10000 డబ్బులు ఇచ్చేవారికి, తీసుకునే వారికి నిరసనగా బుధవారం నగరంలో మోకాళ్లపై కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. తనకు మద్దతుగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. తన గెలుపు కోసమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికే ఈ ప్రయత్నం అని తెలిపాడు. కాగా ఫోటో గ్రాఫర్ వృత్తిని ఎంచుకున్న ఆయనకు ఎన్నికల్లో కెమెరాను గుర్తునే కేటాయించడం గమనార్హం.

నవతెలంగాణ-భగత్‌నగర్

భారీగా మద్యం పట్టివేత

నవతెలంగాణ - జమ్మికుంట



అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ సీఐ

అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎండి అక్బర్ హుస్సేన్ తెలిపారు. జమ్మికుంట పట్టణం నుండి అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి స్వామి, రాపర్తి రవి అనే ఇద్దరు వ్యక్తుల వద్ద నుండి 210 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, ఇద్దరు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాటి విలువ 26,730 రూపాయలు ఉంటుందన్నారు. ఈ దాడులలో ఎస్సైలు రమాదేవి, కబీర్దాస్, హెడ్ కానిస్టేబుల్ ఐలయ్య, కానిస్టేబుల్స్ మహేష్, పద్మావతి, శైలజ, రేణుక పాల్గొన్నారు.